సాగని పేదల గృహ నిర్మాణం

- నిలిచిపోయిన జగనన్న కాలనీలు
- నెరవేరని పేదింటి అక్కచెల్లెమ్మల సొంతింటి కల
- జోరుగా జరుగుతున్న స్థలాల క్రయ,విక్రయాలు
- 4 వేల ఎన్టీఆర్ గృహాలకు బిల్లులు సిద్ధం


దేవరపల్లి జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలు

దేవరపల్లి: పేదింటి అక్కచెల్లెమ్మల సొంతింటి కల నెరవేర్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గోపాలపురం నియోజకవర్గంలో చేపట్టిన జగనన్న కాలనీల నిర్మాణం పడకేసింది.ఆరు నెలలుగా కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు కూడా ఆసక్తి చూపడం లేదు. గ్రామాలకు దూరంగా స్థలాలు ఇవ్వడంతో గృహనిర్మాణాల చేపట్టలేని పరిస్థితి. ఈ ఏడాది మే లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు కొందరు లబ్ధిదారులు హడావుడిగా ఇళ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. అనంతరం గృహనిర్మాణాలు నిలిచిపోయాయి.

109 లే అవుట్ల ఏర్పాటు

గోపాలపురం సబ్ డివిజన్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 109 లే అవుట్లు ఏర్పాటు చేశారు. 2022–23లో 8,039 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. 2023–24లో 5,767 మందికి గృహాలు మంజూరు చేశారు. వారిలో 1,778 మంది గృహనిర్మాణం చేపట్టగా, 1,101 గృహాల నిర్మాణం పూర్తి చేశారు. 674 గృహాలు వివిధ నిర్మాణ దశల్లో నిలిచిపోయాయి. 3,992 మంది లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించలేదు. నియోజకవర్గంలోనే దేవరపల్లిలో అతిపెద్ద జగనన్న లే అవుట్ ఏర్పాటు చేశారు. దాదాపు 25 ఎకరాలు సేకరించి 1,050 మంది పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు పంపిణీ చేశారు. గుండుగొలను–కొవ్వూరు పాత జాతీయ రహదారికి అనుకుని పోలవరం కుడికాలువ గట్టున ఈ లే అవుట్ వేశారు. ఇంతవరకూ లే అవుట్‌లో దాదాపు 225 గృహాల నిర్మాణం జరిగింది. ఈ లే అవుట్‌కు రూ. 2 కోట్ల వ్యయంతో విద్యుత్ సదుపాయం, సుమారు రూ.కోటి వ్యయంతో మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేశారు.


పునాదిలోనే ఆగిపోయిన ఇంటి నిర్మాణం


కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు

చేతులు మారుతున్న పట్టాలు

ఇళ్లస్థలాల పట్టాలు చేతులు మారడంతో గృహనిర్మాణం జరగడం లేదని అధికారులు అంటున్నారు. చాలామంది లబ్ధిదారులు స్థలాలను క్రయవిక్రయాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. సెంటున్నర స్థలం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు పలుకుతున్నట్టు తెలిసింది. ఎక్కువగా దేవరపల్లిలోనే స్థలాల పట్టాలు చేతులు మారుతున్నట్టు సమాచారం. ఈ విషయం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి వెళ్లింది. ఆయన ఆదేశాలపై స్థలాలను సర్వే చేసి అనర్హులను గుర్తించి, వారి పట్టాలు రద్దు చేసేందుకు రెవెన్యూ అధికారులు సమాయత్తం అవుతున్నారు.

జరగని బిల్లుల చెల్లింపులు

తాము నిర్మించుకున్న ఇళ్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. దానికితోడు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నట్టు దేవరపల్లి లే అవుట్ లబ్ధిదారులు పేర్కొంటున్నారు. రోడ్లు లేక ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నామని, వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని పలువురు మహిళలు చెబుతున్నారు. గృహాలు నిర్మించుకుని ఏడాది కావస్తున్నా ఇంత వరకూ రోడ్డు వేయలేదని వారు పేర్కొంటున్నారు.

ఎన్టీఆర్ గృహాల కోసం ఎదురు చూపులు

కూటమి ప్రభుత్వంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రచారం జరగడంతో లబ్ధిదారులు కొత్త పథకం కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున మంజూరు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.4 లక్షల చొప్పున మంజూరు చేస్తుందని ప్రచారం జరుగుతుండడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయినట్టు తెలిసింది. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు మాత్రమే ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం వర్తిస్తుందని, ఇప్పటికే చేపట్టిన వారికి వర్తించదని అధికారులు చెబుతున్నారు. ఇంటికి రూ.4 లక్షల మంజూరు వాస్తవం కాదని అధికారులు అంటున్నారు.

ఎన్టీఆర్ గృహాలకు బిల్లుల చెల్లింపు

2014–19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులు నిర్మించుకున్న గృహాలకు అప్పట్లో బిల్లులు చెల్లింపులు జరగలేదు. అనంతరం వచ్చిన ప్రభుత్వం ఈ గృహాల గురించి పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో నిర్మించుకున్న గృహాలను అధికారులు సర్వే చేసి, సుమారు 4 వేల మంది లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. వారందరికి మార్చి తర్వాత బిల్లుల చెల్లింపు జరపనున్నట్టు అధికారులు తెలిపారు.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేదు

జగనన్న లే అవుట్లలో ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో జాప్యం లేదు. సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నాం. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 1101 మంది లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోగా బిల్లులు చెల్లించాం. ఎక్కువగా పట్టాలు చేతులు మారుతున్నాయి. రెవెన్యూ అధికారులు స్థలాలను సర్వే చేస్తున్నారు. అనర్హుల పట్టాలు, క్రయవిక్రయదారుల పట్టాలు రద్దు చేస్తారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో గతంలో నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపునకు జాబితాలను సిద్ధం చేశాం. నియోజకవర్గంలో 4 వేల గృహాలు ఉన్నాయి. 2025 మార్చి తర్వాత ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో కొత్త గృహాలు మంజూరవుతాయి. ఒక్కొక్క గృహానికి ప్రభుత్వం రూ.2.50 లక్షలు మంజూరు చేస్తోంది. లే అవుట్లలో సిమెంట్ రోడ్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– టి. శేఖర్‌బాబు, డీఈఈ, గృహనిర్మాణ శాఖ, గోపాలపురం

క్లుప్తంగా

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ


కొవ్వూరులో కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

కొవ్వూరు: ఇటీవల బుడమేరు వరద ముంపు బారిన పడిన విజయవాడలో విధులు నిర్వహించిన పట్టణానికి చెందిన పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి బహుమతిగా అందించిన రెండు జతల దుస్తులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఒక్కో కార్మికుడికి రెండు జతల చొప్పున దుస్తులు అందజేశారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి,మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల హాల్టుల పునరుద్ధరణకు ఎంపీ చర్యలు


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: కరోనా విపత్తుకు ముందు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆగే రైళ్ల హాల్టుల పునరుద్ధరణకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చర్యలు తీసుకుంటున్నట్టు బీజేపీ నాయకులు వెల్లడించారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. రైళ్ల హాల్టుల విషయంపై ఎంపీ ఇటీవల రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసినట్టు నాయకులు చెప్పారు. కొన్ని సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ కొవ్వూరు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తిరుమల, సర్కార్, సింహాద్రి, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ల హాల్టులను పునరుద్ధరించే అవకాశం ఉందన్నారు. దీనిపై ఈనెల 29న ఎంపీ పురందేశ్వరి మరోసారి రైల్వే శాఖ మంత్రిని కలవనున్నట్టు తెలిపారు. కచ్చితంగా ఈ నాలుగు ట్రైన్ల హాల్టులను సాధించనున్నట్టు ఎంపీ తమతో చెప్పారన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఆ పార్టీ కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మాట్లా వీరాంజనేయులు, కో-కన్వీనర్ బోడపాటి వెంకట ముత్యాలరావు, సీనియర్ నాయకులు ముప్పరాజు శ్రీనివాసరావు, కొండపల్లి రత్నసాయి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

తాళ్లపూడి: స్థానిక హంస వాహినీ స్కూల్ విద్యార్థులు మంగళవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.విద్యార్థులు నేరుగా ఇంటింటికీ వెళ్లి 15 మంది పేదలైన వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరస ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాతృత్వంపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

నాలుగు బంగారు పతకాలు కైవసం


కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించిన దేవరపల్లి, దూబచర్ల విద్యార్థులు

దేవరపల్లి/నల్లజర్ల: వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించిన 9వ జాతీయ కరాటే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున దేవరపల్లి, దూబచర్ల విద్యార్థులు పాల్గొని సత్తా చాటి బహుమతులు గెలుచుకున్నారు. కుమితే విభాగంలో జి.భాగ్యశ్రీ (దేవరపల్లి), హేమ (దేవరపల్లి), లోహిత్ చౌదరి (దూబచర్ల), తనుష్ (దూబచర్ల) బంగారు పతకాలు సాధించారని కరాటే మాస్టర్ జక్కంశెట్టి శ్రీనివాస్ తెలిపారు. కత విభాగంలో జె.రేష్మ (దేవరపల్లి),ఎస్‌కే జాఫిర్ బాషా (దూబచర్ల) ద్వితీయస్థానం సాధించి వెండి పతకాలు సాధించినట్టు వెల్లడించారు. మొదటి రన్నరప్ ట్రోఫీని ఆంధ్రప్రదేశ్ గెలుచుకున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో 16 రాష్ట్రాల నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.

క్రీస్తు ప్రేమతత్వాన్ని అందరూ అలవరచుకోవాలి

నిడదవోలు: స్థానిక కృపాధార లూథరన్ చర్చిలో మంగళవారం రాత్రి పాస్టర్ రెవరెండ్ బయయ్యే ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధించిన ప్రేమతత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలన్నారు. సండే స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యువజనలు క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలియజేసే నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన పట్టణ శాఖ అధ్యక్షుడు రంగా రమేష్, ఎం. దేవసహాయం, అక్కాబత్తుల క్రిస్టియన్‌రావు, వరసాల కృష్ణ, పల్లి బంగారురాజు, దాకే కాంతారావు, తూరు గోపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపునకు నిరసన తెలుపుదాం

- వైఎస్సార్ సీపీ గోపాలపురం కన్వీనర్, మాజీ మంతి తానేటి వనిత
- అచ్చన్నపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశం


నల్లజర్లలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఈ నెల 27న గోపాలపురంలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట వైఎస్సార్ సీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని మాజీ మంత్రి తానేటి వనిత పిలుపునిచ్చారు. అచ్చన్నపాలెంలోని కాకర్ల వారి కల్యాణ మంటపంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం సమర్పిద్దామన్నారు. విద్యుత్‌చార్జీల పెంపుపై పోరుకు అన్ని మండలాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని వనిత కోరారు. ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసగించిందని విమర్శించారు. సూపర్ సిక్స్ అంటూ కల్లబొల్లి మాటలు చెప్పిన టీడీపీ నాయకులు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. కూటమి పాలనలో పెరిగిన నిత్యావసరాల ధరలు సామాన్యుడికి భారంగా మారాయన్నారు. ఇంతలో విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై మరింత భారాన్ని మోపారని దుయ్యబట్టారు.

మండల కన్వీనర్‌గా వెల్లంకి

సమావేశంలో వైఎస్సార్‌సీపీ నల్లజర్ల మండల కన్వీనర్‌గా వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనకు వనిత శాలువా కప్పి అభినందించారు. ఇంతవరకూ మండల కన్వీనర్‌గా సేవలు అందించిన గగ్గర శ్రీనివాస్‌ను శాలువా కప్పి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బంక అప్పారావు, వామిశెట్టి పావనీకుమారి, పరమేశ్వరరావు, తొమ్మండ్రు రమేష్, సయ్యద్ మునాఫ్, ఈలప్రోలు చంద్రరావు, జువ్వలపాలెం అన్నవరం, జాలపర్తి రత్తయ్య, శెనగన సతీష్, తోట వెంకట్రావు, చిన్నీ నాగూ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సు

కొవ్వూరు: గ్రామాల్లోని భూ వివాదాలు, రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. సీతంపేట, మద్దూరులంక గ్రామాలతో పాటు చిగురుల్లంక గ్రామాల రెవెన్యూ సదస్సును మంగళవారం సీతంపేట గ్రామ సచివాయలం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 12 అర్జీలు అందగా, వాటిలో ఎనిమిదింటిని వెంటనే పరిష్కరించినట్టు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. వన్-బీ, అడంగల్ కోసం మరో నాలుగు అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నిర్దిష్ట కాల వ్యవధిలోగా వాటిని కూడా పరిష్కారిస్తామని ఆయన చెప్పారు. చిగురుల్లంక, మద్దూరులంక రెవెన్యూ గ్రామాల పరిధిపై గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన సర్వేరాళ్లపై ఉన్న అక్షరాలు, పథకాల పేర్లతో పాటు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను అధికారులు చెరిపించి వేశారు.

మార్కెల్లమూడి గ్రామంలో..

నల్లజర్ల: భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలనే లక్ష్యంతోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జ్ తహసీల్దారు ఎస్‌వీకే నాయుడు అన్నారు. మారెళ్ళమూడి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ సుబ్రమణ్యేశ్వరి, వీఆర్వోలు రాజేష్, శామ్యూల్, లక్ష్మణమూర్తి, నరేష్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం.హరిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని సత్యవాడ, చిలకపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసదస్సులో వచ్చిన ఏడు అర్జీలను ఆన్‌లైన్ చేసినట్లు హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జి.శ్రీనివాస్, ఆర్‌ఐ యు.రవిచంద్ర, వీఆర్వో లక్ష్మీ నరసమ్మ, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.


మారెళ్లమూడి రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

యువతకు ఉద్యోగావకాశం

కొవ్వూరు: హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడలోని దివీస్ పరిశ్రమల్లో పొడక్షన్ విభాగంలో పనిచేసేందుకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, బీటెక్ కెమికల్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలైటికల్ కెమిస్ట్రీ, ఎం ఫార్మసీ (క్యూఏ, ఆర్‌ఏ) పూర్తి చేసిన యువకులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు కొవ్వూరులోని ఏబీఎన్ అండ్ పీఆర్‌ఆర్ కళాశాలలో గురువారం ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహనరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆ రోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 2020 – 24 మధ్య డిగ్రీ, పీజీ పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. అర్హతలను బట్టి రూ.18 వేల నుంచి రూ.24 వేల వరకూ జీతం ఉంటుందన్నారు.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం


విద్యుత్ దీపాలతో అలంకరించిన వేలివెన్నులోని జీడీఎం చర్చి

- నేడు క్రీస్తు పుట్టిన రోజు
- విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న చర్చిలు
- కొనసాగుతున్న సెమీ క్రిస్మస్ వేడుకలు


నిడదవోలు సెయింట్ జాన్స్ మైనర్ సెమినరీలో ఏర్పాటు చేసిన పశువుల పాక సెట్టింగ్

నిడదవోలు: క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణంతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. ఏసుక్రీస్తు పుట్టినరోజైన డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంప్రదాయం. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. క్రైస్తవుల ఇళ్ల వద్ద విద్యుత్ కాంతులతో ఇప్పటికే స్టార్‌లు దర్శనమిస్తున్నాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో చర్చిలు కళకళలాడుతున్నాయి. చిన్నారులకు ఆటల పోటీలతో పాటు బైబిల్‌పై వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు క్రిస్మస్ రోజు రాత్రి బహుమతులు అందిస్తారు.

వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి వనిత

గోపాలపురం: స్థానిక బేతేలు ప్రార్థనా మందిరంలో మంగళవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. ఆమె కేక్ కట్ చేసి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జననం, ఆయన ప్రస్థానాన్ని బేతేలు ప్రార్థనా మందిరం పాస్టర్ తిగిరిపల్లి గాబ్రియేలు వివరించారు. అనంతరం సిర్రా దైవదానం, కొక్కిరపాటి రవి వాఖ్య సందేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, గెల్లా వెంకట శ్రీను, సంఘ కాపరి టి. జాన్‌పాల్, దైవజనులు, సంఘస్తులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధుల ఆశ్రమంలో యర్నగూడెం సెయింట్ జోసెఫ్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ సజీ థామస్ క్రిస్మస్ కేక్‌కట్ చేసి వృద్ధులకు పంచారు. వృద్ధులకు భోజన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు గుదే శ్యామలాదేవి, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో క్రిస్మస్ కాంతులు..

నిడదవోలు రూరల్: లోక రక్షకుడి జన్మదినమైన క్రిస్మస్ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల చర్చిలను వివిధ రంగుల నక్షత్రాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే క్రిస్మస్ పాకలు ఏర్పాటు చేశారు. సమిశ్రగూడెం, డి.ముప్పవరం, పందలపర్రు, పురుషోత్తపల్లి, తాడిమళ్ల, సింగవరం, గోపవరం, విజ్జేశ్వరం, అట్లపాడు, కలవచర్లలోని ప్రధాన చర్చిల్లో బుధవారం క్రిస్మస్ ఆరాధనలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు.


గోపాలపురంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి తానేటి వనిత

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్ను గ్రామంలో1933లో బ్రిటిష్ హయాంలో నిర్మించిన జీడీఎం చర్చి (గోదావరి డెల్టా మిషన్ బేతస్త క్రిస్టియన్ అసెంబ్లీ)లో 92వ కిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఏసుక్రీస్తు పుట్టిన రోజు, క్రిస్మస్ పండగను స్వాగతిస్తూ క్రైస్తవులు సందడి చేయనున్నారు. మండలంలోని క్రిస్మస్ వేడుకలకు క్రీస్తు లూథరన్ చర్చి, బైబిల్ మిషన్, జీడీఎం, క్యాథలిక్, జీడీఎం, సీజీఎం, ఐబీఎం షారోను చర్చిల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.


నిడదవోలు మండలం సమిశ్రగూడెం లూథరన్ చర్చి వద్ద ఏర్పాటుచేసిన క్రిస్మస్ స్టార్